క్లుప్తంగా

ఉచితంగా 11 రకాల సేవలు



మామిళ్లపల్లిలో జగనన్న సురక్షపై ఇంటింటా సర్వే చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కనగానపల్లి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను అందిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు తెలిపారు. ఆదివారం మామిళ్లపల్లి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటింటా సర్వే చేశారు. స్థానిక సమస్యలను గుర్తించడంతో పాటు ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల కోసం వలంటీర్ల ద్వారా దరఖాస్తులు తీసుకున్నారు. ముక్తాపురం గ్రామ సచివాలయం వద్ద ఈ నెల 27న జరిగే జగనన్న సురక్ష క్యాంపులో ధ్రువీకరణ పత్రాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చిరంజీవి, వీఆర్వో చెన్నకేశవులు, సర్పంచ్ ఓబిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అమరనాథరెడ్డి, అంకే తిరుపాలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పోతలయ్య స్వామికి ప్రత్యేక పూజలు

కనగానపల్లి: మండలంలోని దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు పోతలయ్య, చెన్నేకేశవస్వామి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. తర్వాతా పోతలయ్య స్వామి వారికి బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామి వారికి కానుకలు అందించారు.

నిత్యావసరాల వితరణ



అనాథాశ్రమానికి నిత్యావసరాలు, దుప్పట్లు అందిస్తున్న కెనరా బ్యాంకు ఉద్యోగులు

ధర్మవరం: బ్యాంకుల జాతీయకరణ జరిగి 55 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కెనరా బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ ఆదివారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. అప్రాచెరువు యూనిట్ సభ్యులు గొట్లూరులోని అనాథాశ్రమానికి రూ.15 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు, దుప్పట్లు, చాపలు అందజేశారు. సామాజిక సేవలో కెనరా బ్యాంకు నిరంతరం ముందంజలో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు షామీర్ బాషా, మంజు, గోపి, దినేష్, నాగభూషణం, శ్రీనివాసులు, లీలావతి, హరిత, మనీజ, జ్ఞానేశ్వరి, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు దిగితే ఉపేక్షించం




రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ శివశంకర్ నాయక్

గాండ్లపెంట: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీ షీటర్లకు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో రూరల్ సీఐ శివశంకర్ నాయక్ కౌన్సెలింగ్ ఇచ్చారు. సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

నేడు స్పందన

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయవచ్చన్నారు.

ఘనంగా 'ఖత్మే ఖురాన్'



విద్యార్థులకు ఖురాన్ గ్రంథాన్ని అందజేస్తున్న మౌలానా మహమ్మద్ తౌసిఫ్

కదిరి అర్బన్: పట్టణంలోని జెండామాను వీధిలో ఉన్న మదరసా రబ్బానియాలో ఆదివారం 'ఖత్మే ఖురాన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మౌలానా మహమ్మద్ తౌసిఫ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది మదరసాలో 32 మంది విద్యార్థులు ఖురాన్ పఠనం పూర్తి చేశారన్నారు. అందులో ఏడు సంవత్సరాలు వయస్సు ఉన్న అమ్మాయితో పాటు మహిళలు కూడా ఉండడం సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థులకు దివ్య ఖురాన్ గ్రంథం, బట్టలు, టోపీ, బురఖాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మదరసా అధ్యక్ష, కార్యదర్శులు హాజీ జాఫర్‌సాదిక్, అత్తార్‌మహబూబ్ బాషా, అజీంఖాన్, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

ఆటపాటలే చదువు

- అంగన్‌వాడీల్లో ఆటబొమ్మలు చూపిస్తూ విద్యాబోధన
- చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణం
- ప్రైవేట్, కార్పొరేట్ స్థాయిలో ప్రీ ప్రైమరీ బోధన



పుస్తకాల్లో బొమ్మలను చూపి అక్షరాలు పలికిస్తున్న అంగన్‌వాడీ టీచర్

చెన్నేకొత్తపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో అర్థమయ్యే విధంగా విద్యాబోధన అందిస్తారు. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ చదివించాలనుకునే పేద మధ్య తరగతి వారికి ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వం కూడా వారిని నిరుత్సాహ పరచకూడదని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రైమరీ పాఠశాలలుగా మార్చి, విద్యాబోధన అందిస్తున్నాయి. చెన్నేకొత్తపల్లి ఐసీడీఎస్ సెక్టారు పరిధిలోని రామగిరి కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని 172 అంగన్‌వాడీ కేంద్రాల్లో 7,857 మంది పిల్లలు ఉన్నారు. ఆయా కేంద్రాల్లో పిల్లలకు కథలు చెప్పడం, సృజనాత్మకతను వెలికితీయడం, బొమ్మలను ఇచ్చి హావభావాలతో చిన్న చిన్న పాఠాలు చెప్పించడంతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నారు.దీంతో చిన్నారులు కూడా ఉత్సాహంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్నారు.

ప్రైమరీ విద్య:
అంగన్‌వాడీ కార్యకర్తలు మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు అవగాహనతో కూడిన విద్యాను అందిస్తున్నారు. సంపూర్ణ అభివృద్ధి, మేథస్సు పెంపొందించి, బడికి సంసిద్ధులను చేస్తున్నారు. దీంతో పిల్లలు శారీరకంగా మానసికంగాను ఎంతో అభివృద్ధి చెందుతున్నారు. అందుకే ప్రభుత్వం పీపీ-1, పీపీ-2 తరగతుల పాఠ్య పుస్తకాలను రూపొందించింది. పిల్లలు త్వరగా నేర్చుకునే వయస్సు కాబట్టి వారిని అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ రకాల పదాలను నేర్పిస్తున్నారు. బొమ్మలను చూపించిన ఇంగ్లిష్ పదాలను కూడా పలికిస్తున్నారు.

ప్రీప్రైమరీ కిట్లు ..
ప్రీ ప్రైమరీ రెండు విభాగాలుగా విభజించారు. ప్రీ ప్రైమరీ-1లో 4 ఏళ్లలోపు పిల్లలు ఉంటారు. ప్రీ ప్రైమరీ-2లో 4 ఏళ్ల పైబడిన పిల్లలు ఉంటారు. వీరికి బొమ్మలు, అక్షరాలు, స్పోకెన్ ఇంగ్లిష్ పదాలు, కథలు, బొమ్మలు ఉన్న పుస్తకాలు అందిస్తారు. వీటితోపాటు కలర్ పెన్సిళ్లు, పలకలు ఇస్తారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి టీచర్ తమకు కేటాయించిన సిలబస్ ప్రకారం పిల్లలకు విద్య అందించాలి. విద్యా సంవత్సరం మూడు విభాగాలుగా చేసి ఆయా మాసాల్లో పిల్లలకు ఏమేమి నేర్పించాలో వాటి ప్రకారం విద్యను అందిస్తారు.

బడికి సన్నద్ధులను చేస్తాం



పిల్లలు కాస్త పెద్దయ్యాక బడికి పోవాలంటే మారాం చేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను చేర్పించడం వల్ల వాళ్లలో ఉన్న భయాన్ని పోగొడతాం. ఆటపాటలతో పిల్లలకు విద్య అందిస్తాం. ప్రైవేట్ పాఠశాలల్లో మాదిరిగా ఇంగ్లిష్ పదాలు, అంకెలు, కథలు నేర్పించి పాఠశాలలకు ఇష్టంగా వెళ్లేందుకు సంసిద్ధం చేస్తాం
– లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త, న్యామద్దల

ఎంతగానో ఉపయోగం

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రీ ప్రైమరీ విద్య అందించడం ద్వారా పేద, మధ్య తరగతి వారికి ఎంతగానో ఉపయోగ పడుతుంది. కేంద్రాల్లో పీపీ-1, పీపీ-2 కిట్లను పంపిణీ చేస్తున్నాం. పలక, స్పోకెన్ ఇంగ్లిష్, బొమ్మలు, కథల పుస్తకాలు కలర్ పెన్సిళ్లతో కూడిన కిట్లను అందిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా టీచర్లు కూడా పిల్లలకు ఆకట్టుకునే విధంగా విద్యనందిస్తున్నారు.
– కవితాదేవి, సీడీపీఓ, చెన్నేకొత్తపల్లి క్లస్టర్

ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు



నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయిస్తున్న డిపో మేనేజర్ ఇనాయతుల్లా

పుట్టపర్తి టౌన్: ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు పుట్టపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనాయతుల్లా తెలిపారు. పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రైవేటు వాహనాలు అధికంగా వెళ్లడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రైవేట్ వాహనాలు లోపలికి రాకుండా బస్టాండ్ వద్ద నోపార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు విద్యా సంస్థల బంద్

ధర్మవరం: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 25వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ చేపట్టనున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. పట్టణంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు పోతలయ్య మాట్లాడారు. బంద్‌కు విద్యాసంస్థలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ ఆర్గనైజేషన్ కార్యదర్శి ఇర్షాద్, ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు చైతన్య, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పల్లె.. గిమ్మిక్కులు మానుకో



పుట్టపర్తి టౌన్: పల్లెకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బుక్కపట్నంలో పల్లె రఘునాథరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న దృశ్యం



అమడగూరు: పోలీస్ స్టేషన్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండి పడ్డారు. ఇటీవల ఓడీచెరువులో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి చేసిన అసత్య ఆరోపణలను వారు ఖండించారు. కొత్తచెరువులోని మస్తాన్ స్వామి దర్గా వద్ద నిరసన చేపట్టారు. అబద్ధాల కోరు పల్లె రఘునాథరెడ్డి.. డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బ్యాంకులు ఎమ్మెల్యేకు నోటీసులు ఇస్తే ప్రజలకు వాటిల్లే నష్టం ఏమిటని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కడ ఓడిపోతానో అనే భయంతో పల్లె ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి గిమ్మిక్కు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఎంపీపీ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యవర్గ సభ్యుడు వాల్మీకి శంకర్, వక్ఫ్‌బోర్డు మెంబర్ ఫాన్‌షేట్, ట్రేడ్ యూనియన్ అధక్షుడు అంగడి సోముశేఖర్‌రెడ్డి ఎంపీటీసీ రవీ, కన్వీనర్ జగన్ మోహన్‌రెడ్డి నాయకులు జాకీర్, అజీజ్ రహమాన్, వెంకటరాముడు, అయూబ్‌ఖాన్, బాబు, ఎల్లప్ప, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై పల్లె రఘునాథరెడ్డి, ఇతర టీడీపీ నేతలు చేసిన ఆరోపణలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఖండించారు. బుక్కపట్నంలో లాయర్ నాగమల్లేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాగనంద స్వామి ఆశ్రమం వద్ద నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నినా ప్రజలు నమ్మరన్నారు. ఇది ఇలా ఉండగా ఉదయమే బుక్కపట్నం నేతలు పతంజలి, మహేష్, నారాయణస్వామి తదితరులను పోలీసులు అరెస్టు చేసిన స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి కేశప్ప, సొసైటీ అధ్యక్షుడు ఆవుటాల రామలింగారెడ్డి, రవి, ఎల్ఐసీ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు కేరాఫ్ 'పల్లె'
అమడగూరు: అక్రమాలు, అవినీతికి కేరాఫ్ మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి అని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. రెండు రోజుల కిత్రం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై పల్లె చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. 15 ఏళ్లు ఎమ్మెల్యేగా పని చేసిన పల్లె.. నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి వ్యాపారాల్లో నష్టం వాటిల్లినా అనునిత్యం కార్యకర్తలకు అండగా ఉన్నారని తెలిపారు. మా ఎమ్మెల్యేపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కోట్లలో వ్యాపారాలు చేసేవారు బ్యాంకుల్లో రుణాలు పొందడం సహజమన్నారు. నిరసనకు దిగిన వైఎస్సార్‌సీపీ నాయకులను సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో రాష్ట్ర బలిజాల సంఘం డైరెక్టర్ మధుసూదన్‌రాజు, సొసైటీ అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, బొట్టుస్వామి, సర్పంచులు షబ్బీర్, ఆదినారాయణ, మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ పెద్దప్పయ్య, సురేంద్రరెడ్డి, నక్కల చిన్నప్ప, నాగరాజు, శంకర, ఉత్తప్ప, వెంకటరెడ్డి, సిభక్తుల్లా, అమరనాథరెడ్డి, లోకేష్ రెడ్డి, మీసాల నాగరాజు, అన్వర్, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేయాలి



ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: పార్టీ కోసం కష్టపడిన వారందరికీ న్యాయం చేస్తానని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కొత్తచెరువు మండల ప్రచార కార్యదర్శి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులుగా నియమితులైన సంజీవరెడ్డి, ధనుంజయ ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని కలిశారు. ఎమ్మెల్యేను పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కేటాయించిన పదవులకు న్యాయం చేయాలన్నారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షులు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నివాళి..
పుట్టపర్తి: బుక్కపట్నం మండలం అగ్రహారం ఎంపీటీసీ సావిత్రి కుమారుడు కిరణ్ (30) శనివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని మృతుడు కిరణ్‌కు నివాళులర్పించారు. తల్లిదండ్రులు సావిత్రి, కిష్టప్పను ఓదార్చారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, శివయ్య, మల్లేష్, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభం



బత్తలపల్లిలో ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన కాసీంస్వామి

బత్తలపల్లి: మొహర్రం వేడుకలలో భాగంగా బత్తలపల్లి ఖాసీంస్వామికి ఆదివారం నిత్యపూజ నివేదన నిర్వహించారు. ఉదయం ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్‌బాషా, నజరుల్లా, కాశింవలి తదితరులు ఖాసీంస్వామి చావిడిలో ఫాతెహాలు చేపట్టారు. అలాగే మండలంలోని గంటాపురం, పోట్లమర్రి, వేల్పుమడుగు, ముష్టూరు, మాల్యవంతం, సంజీవపురం, రాఘవంపల్లి, యర్రాయపల్లి, లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలకు అంకురార్పణ చేశారు. అదేవిధంగా మొహర్రం ఉత్సవాలపై ఎస్ఐ టీవీ శ్రీహర్ష వివిధ గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలు, ముజావర్లుతో పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించి చర్చించారు. పోలీసుల అనుమతులు లేకుండా ఏ గ్రామంలోనూ మొహర్రం ఉత్సవాలను నిర్వహించరాదన్నారు. గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ ఆరోహణరావు పేర్కొన్నారు.

వైద్య చికిత్సకు ఆర్థికసాయం



కెంపన్నకు ఆర్థికసాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తనకల్లు: మండల పరిధిలోని గందోడివారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరిప్రసాద్ తండ్రి కెంపన్న కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి చికిత్స కోసం రూ.30 వేల ఆర్థికసాయం పంపించారు. ఆదివారం ఆ మొత్తాన్ని సర్పంచ్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీహరిరెడ్డి తదితరులు కెంపన్నకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమణ, విజయ్, శేఖర్‌రెడ్డి, నాగార్జున, మహదేవ రెడ్డి, మనోజ్‌కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, అంజనేయులు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి..
తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటిక్రాస్ చంద్రబాబు కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుధాకర్ విద్యుదాఘాతంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న పార్టీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులరెడ్డి ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ముస్తఫా, లక్ష్మీపతి, పూల ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షం కురవాలని పూజలు



బొడ్రాతమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

తలుపుల: వర్షాలు సకాలంలో కురవాలని కోరుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గంజివారిపల్లి సమీపంలోని చింతల గంగమ్మకు, మాడికవాండ్లపల్లి గ్రామం సమీపంలోని నందీశ్వరుడికి, ఆయా గ్రామాల్లోని బొడ్రాతమ్మలకు 101 బిందెల నీరు పోసి ప్రార్థించారు. ఇళ్ల నుంచి మహిళలు బోనాల గంపలు ఎత్తుకుని ఊరేగింపు చేపట్టారు.

పురానికి చేరుకున్న శివలింగం



శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని టీచర్స్ కాలనీలోని ఆచలగురు ఆశ్రమంలో నిర్మిస్తున్న శివాలయంలో ప్రతిష్టించేందుకు తయారు చేయించిన ఆరు అడుగుల శివలింగాన్ని ఆదివారం పట్టణానికి తీసుకొచ్చారు. కర్ణాటకలోని మాలూరు సమీపంలో ఉన్న శ్రీవారి పట్టణంలో ప్రత్యేకంగా ఆరడుగుల శివలింగాన్ని తయారు చేయించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చిన శివలింగం, నంది, గణేష్ విగ్రహాలకు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నడియెప్పన్ స్వామి, శ్రీనివాసులు, సత్యనారాయణ, సత్తి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ధనకొండ గంగమ్మ జాతర



గంగమ్మకు బోనాలు తీసుకొస్తున్న దృశ్యం

తనకల్లు: మండల పరిధిలోని కనసానివారిపల్లి సమీపంలో వెలసిన ధనకొండ గంగమ్మ దేవత జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో పూజలు చేసి ప్రసాదం అందజేశారు. వేడుకలా జరిగిన ఈ కార్యక్రమానికి ఆలయ పునర్నిర్మాణ దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంపీ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆలయాభివృద్ధికి అన్ని విధాల అండగా ఉన్న ఎంజీరెడ్డిని గోళ్లవారిపల్లి అంబేడ్కర్ కాలనీవాసులు సత్కరించారు. అనంతరం గంగమ్మకు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ వినోద్ కుమార్, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు సమరసింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, అమర్ కార్తికేయ, ప్రభావతి, జగదీష్, యశ్వంత్, గణేష్, సోమశేఖర్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.

మల్బరీ సాగు లాభదాయకం

- సెరికల్చర్ అధికారిణి సుమముక్త శ్రీ



చెన్నేకొత్తపల్లి: మల్బరీ సాగుతో లాభదాయకమని సెరికల్చర్ అధికారిణి సుమముక్త శ్రీ తెలిపారు. రైతులకు ఆమె మల్బరీ సాగు పద్ధతులు, సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. మల్బరీ సాగు చేసే రైతులకు జనరల్ కేటగిరీ కింద ఎకరాకు రూ.10,500, ఎస్సీ, ఎస్టీ, రైతులకు రూ.12,600 ప్రభుత్వం అందిస్తుందన్నారు. షెడ్లు నిర్మించుకునే రైతులకు జనరల్ అయితే 50 గీ20 విస్తీర్ణంలో నిర్మించుకునే షెడ్డుకు రూ.3 లక్షలు మంజూరవుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులైతే రూ.3,60,000 అందిస్తామన్నారు. రైతులు పంట సాగు నుంచి మార్కెట్‌కు తరలించే వరకు ప్రతి దానికీ ప్రభుత్వం రాయితీలు అందిస్తుందన్నారు. రైతులు పట్టు పురుగుల పెంపకానికి అవసరమైన స్టాండ్లు ఏర్పాటుకు జనరల్ రైతులకు రూ.56,250, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.67,500 అందిస్తుందన్నారు. రూ.25వేలు విలువచేసే చంద్రికల కోసం జనరల్ రైతులకు రూ.6,700, ఎస్సీ, ఎస్టీ రైతులు రూ.2,500 చెల్లించాలన్నారు. రెండు ఎకరాల మల్బరీ తోట సాగు చేసిన రైతులకు 30 గీ20 విస్తీర్ణంలో నిర్మించుకునే చిన్న షెడ్డుకు జనరల్ రైతులకు రూ.2,25,000, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2,70,000 ప్రభుత్వం తరఫున అందజేస్తామన్నారు. వివరాలకోసం సెల్: 95336 01205లో సంప్రదించాలన్నారు.

మణిపూర్ మారణకాండకు ముగింపు పలకాలి

ధర్మవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మణిపూర్ మారణకాండకు ముగింపు పలకాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి కోరారు. ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. ముఖ్యమంత్రి బీరన్‌సింగ్ అల్లర్లను ప్రేరేపించేలా విధంగా కుకీలు విదేశీయులంటూ మాట్లాడటం సరికాదన్నారు. మైత్రేయి, కుకి జాతుల మధ్య జరుగుతున్న అల్లర్లను మతాల మధ్య అల్లర్లుగా సృష్టించి మహిళలను నగ్నంగా ఊరేగించడం, హత్య చేయడం మానవత్వానికి మచ్చగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, లక్ష్మయ్య, రాంప్రసాద్, హరికృష్ణ, రామంజనేయులు, అమర్ నారాయణ రెడ్డి, విజయభాస్కర్, సాయిగణేష్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కదిరి టౌన్: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం కావేరి హాస్పిటల్ బెంగళూరు వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు పథ్వీరాజ్ తెలిపారు. కార్డియాలజీ వైద్యుడు ఎస్‌పి.జ్ఞానదేవ్, జనరల్, లాప్రోస్కోపిక్ వైద్యురాలు డాక్టర్ అనుష రోగులకు వైద్య సేవలు అందజేశారు. యాంజియోగ్రామ్‌కు 21 మందిని, గుండె సంబంధిత చికిత్సలకు 12 మందిని బెంగళూరు కావేరి హాస్పటల్‌కు రెఫర్ చేశారు. కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్యుడు డాక్టర్ సీవీ మదన్‌కుమార్, భాస్కర్‌నాయక్, బాబాపకృద్దీన్, రోటరీ క్లబ్ కార్యదర్శి తాయి సుదర్శన్ నితిన్, సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో పూజలు

తాడిమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలోని పెద్దమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి పెద్దమ్మ విగ్రహానికి వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం మహిళలు అధిక సంఖ్యలో కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూజారి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.